సాక్షి ఖమ్మం

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



మోగిన సమ్మె సైరన్

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మెకు దిగారు. దీంతో జిల్లాలోని కేంద్రాలు తెరుచుకోలేదు. 8లో



మరో చాన్స్ కోరడం విడ్డూరం

యాభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఇంకోసారి అవకాశం కోరడం విడ్డూరంగా ఉందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 25°

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

జాతీయ జెండా ఎగురవేయనున్న మంత్రి



ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17న తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండా ఎగురవేయనున్న ప్రజాప్రతినిధుల జాబితాను సీఎస్‌శాంతికుమారి వెల్లడించారు. ఈమేరకు ఖమ్మంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేయనున్నట్లు తెలిపారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించనుండగా, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుండి మరో ఆరు కేంద్రాల్లో 'ఆరోగ్య మహిళ'

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో కొత్తగా ఆరు ఆస్పత్రుల్లో మంగళవారం నుంచి 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ బి.మాలతి తెలిపారు. మంచుకొండ, బోనకల్, వైరా, ఎం.వీ.పాలెం, కామేపల్లి, చెన్నూరు పీహెచ్‌సీల్లో ప్రస్తుతం కార్యక్రమం కొనసాగుతోందని చెప్పారు. కొత్తగా లంకాసాగర్, వేంసూరు, ముదిగొండ, నేలకొండపల్లి, సుబ్లేడ్, ఖమ్మం పాత మున్సిపాలిటీ బస్తీ దవాఖానాలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆయా సెంటర్లలో మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తారని, ఆపరేషన్ చేయాల్సి ఉంటే హైదరాబాద్ పంపిస్తారని వెల్లడించారు.

గుణాత్మక విద్యతో విద్యార్థులకు మేలు

కొణిజర్ల: శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధ్యాయులు గుణాత్మక విద్యనందించాలని, తద్వారా విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. కొణిజర్ల మండలం తనికెళ్లలో సోమవారం గణితం, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు మొదలైన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సామర్థ్యాలు పెంపొందించుకోవడం ద్వారా అభ్యసన ఫలితాలు రాబటట్టాలని తెలిపారు. కాగా, ఈ శిక్షణకు 190 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. కోర్సు డైరెక్టర్, ఎంఈఓ ఎం.శ్యాంసన్, కోఆర్డినేటర్లు డి.పుల్లయ్య, వి.శ్రీనివాసరావు, ఆర్పీలు మువ్వా ప్రసాద్, టి.ఉపేంద్రయ్య, కె.చంద్రశేఖర్, ఎం.డి.మౌలానీ, కృపా బాలానందం, శేషయ్య, వి.చంద్రశేఖర్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా వాసికి 'కీర్తి పురస్కారం'



పురస్కారం అందుకుంటున్న ఉపేందర్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరానికి చెందిన కథా రచయిత రాచమళ్ల ఉపేందర్‌కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 'కీర్తి పురస్కారం' దక్కింది. హైదరాబాద్‌లోని యూనివర్సిటీలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయనకు హాస్య రచనా విభాగంలో విశ్వవిద్యాలయం వీసీ తంగేడు కిషన్‌రావు, పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాదరెడ్డి పురస్కారాన్ని అందజేశారు. కాగా, ఉపేందర్‌ను జిల్లాకు చెందిన రచయితలు, కవులు నామా పురుషోత్తం, దసరోజు శ్రీనివాస్, వురిమళ్ల సునంద, బోగోజు ఉపేందర్‌రావు తదితరులు అభినందించారు.

కారులో కలహాలు



కలిసి రాక.. చొరవ లేక

బీఆర్‌ఎస్ అధిష్టానం గత 21న అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ప్రచారానికి సమయం లభించడమే కాక అసమ్మతి నేతలను సమన్వయం చేసుకునే వెసులుబాటు కలుగుతుందని భావించారు. కానీ ప్రకటన వచ్చి ఇరవై రోజులు గడుస్తున్నా.. అసమ్మతి చల్లారకపోగా శృతి మించుతోంది. వ్యతిరేకిస్తున్న వారితో కలిసిపోయేందుకు అభ్యర్థులు చొరవ తీసుకోకపోవడం, అసమ్మతివాదులు కూడా పట్టు వీడకపోవడంతో రోజురోజుకూ విభేదాలు ముదిరి పాకాన పడి కొత్త వివాదాలకు దారి తీస్తున్నాయి.

పలు నియోజకవర్గాల్లో చల్లారని అసమ్మతి

- రంగంలోకి దిగని సమన్వయ నేతలు
- తాజా పరిణామాలతో అభ్యర్థుల్లో ఆందోళన
- పలుచోట్ల ఇంకా వీడని స్తబ్ధత

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీఆర్‌ఎస్‌లో నివురు గప్పిన నిప్పులా ఉన్న అంతర్గత కలహాలు ఎంతకూ చల్లారడం లేదు. అసమ్మతివాదులు, అభ్యర్థుల మధ్య సయోధ్య కుదరకపోగా.. సమన్వయం కోసం అధిష్టానం నియమించిన ఇన్‌చార్జిలు పూర్తిస్థాయిలో పని మొదలుపెట్టలేదు. దీంతో ఇరువర్గాల నడుమ దూరం కొనసాగుతోంది. ఇక వైరా నియోజకవర్గంలో మూడు రోజుల క్రితం చోటు చేసుకున్న పరిణామాలపై బీఆర్‌ఎస్ అధిష్టానం సీరియస్ అయినట్లు తెలిసింది. పార్టీలోని జిల్లాస్థాయి నాయకులు ఎవరికి వారే అన్న చందంగా వ్యవహరిస్తుండడంతో విభేదాలు సమసిపోకపోగా... పార్టీ కేడర్‌లో ఆందోళన నెలకొంది.

ఇల్లెందుపై వద్దిరాజు నజర్..

రాజ్యసభ్య సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇప్పటికే కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహించగా.. ఇల్లెందులో హరిప్రియ నాయక్‌తో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఇల్లెందులో ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఎడముఖం, పెడముఖంగానే ఉంటుండగా, పలుమార్లు చర్చలు జరిపినా ఏకతాటిపైకి రాలేదు. కానీ సోమవారం నాటి ర్యాలీలో మాత్రం నేతలు భారీగానే పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే పార్టీ అభ్యర్థి విజయానికి పనిచేయాలని వద్దిరాజు సదరు నేతలకు చెప్పినట్టు సమాచారం. ఇన్‌చార్జిగా రెండు నియోజకవర్గాల్లో పర్యటించిన వద్దిరాజు... అసమ్మతి నేతలను బుజ్జగించే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

కొలిక్కిరాని భద్రాద్రి పంచాయితీ

భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో పాత, కొత్త నేతల మధ్య పంచాయితీ ఇంకా కొలిక్కిరాలేదు. తెల్లం వెంకట్రావును అభ్యర్థిగా ప్రకటించడంతో టికెట్ ఆశించిన బోదెబోయిన బుచ్చయ్యకు చుక్కెదురైంది. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అనుచరుడిగా ఉన్న బుచ్చయ్యకు టికెట్ రాకపోవడంతో ఆయన అనుచరులు నైరాశ్యంలో ఉన్నారు. ఆతర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాలసానిని తప్పించి ఎమ్మెల్సీ తాతా మధుకు అప్పగించడంతో మరింత అసహనంతో రగిలిపోతున్నారు. ఇరువర్గాల మధ్య ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో చర్చలు జరగకపోగా.. సయోధ్య కోసం ఎమ్మెల్సీ తాతా మధు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాగా, ఉమ్మడి జిల్లాలోని పాలేరు, ఖమ్మం, మధిర, కొత్తగూడెం, పినపాక, అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో అభ్యర్థులు ప్రచార దూకుడు పెంచారు. ఇక భద్రాచలం, ఇల్లెందు, వైరాలో నేతల కీచులాటలు సమసిపోతేనే ఎన్నికల హడావుడి మొదలుకానుంది.

వైరా తీరే వేరు..

వైరా నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు బీఆర్‌ఎస్ అధిష్టానానికి ఆగ్రహం కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, పార్టీ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ మధ్య విభేదాలు రచ్చకెక్కడంపై పార్టీ అధినేత సీరియస్ అయినట్లు సమాచారం. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మదన్‌లాల్‌ను ప్రకటించాక రాములునాయక్ అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేయకపోగా, సహకరిస్తానని పేర్కొన్నారు. కానీ ఆతర్వాత దళితబంధు జాబితా ఇరువురి నడుమ దూరాన్ని పెంచడంతో తాము నలిగిపోతున్నారని ద్వితీయ శ్రేణి నాయకులు వాపోతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా రాములునాయక్, పార్టీ అభ్యర్థి మదన్‌లాల్ నిర్వహించే కార్యక్రమాల్లో ఎక్కడకు వెళ్లాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. కాగా, ఈ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా నియమించిన ఎంపీ నామ నాగేశ్వరరావు ఇప్పటివరకు అడుగు పెట్టలేదు.

బాధిత కుటుంబాలకు అండగా..





ట్రైసైకిళ్లు అందుకున్న పిల్లలతో మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్ తదితరులు (ఇన్‌సెట్) ఈఈకి శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి పువ్వాడ

- మున్నేరు ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మంలోని నయాబజార్ ప్రభుత్వ పాఠశాల, 16వ డివిజన్‌లోని ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మున్నేరు వరద బాధితులకు ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్నేరు ముంపు బాధితులకు నిత్యావసరాలు, గృహోపకరణాలు ఇప్పటికే అందించగా, రూ.1.45కోట్ల మేర ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. పువ్వాడ ఫౌండేషన్, ఐటీసీ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేసినా, చేతులు దులుపుకోకుండా ఆర్థిక సాయం కూడా చేస్తున్నట్లు తెలిపారు. కాగా, మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.690 కోట్లు మంజూరైనందున త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎంపీ బండి సార్థసారధిరెడ్డి సమకూర్చిన రూ.కోటి, మంత్రి పువ్వాడ కోడలు వారి కుటుంబం నుంచి ఇప్పించిన రూ.50లక్షలను బాధిత కుటుంబాలకు అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం సమగ్ర శిక్షా అభియాన్, అలింకో ఆధ్వర్యాన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేశారు. అలాగే, రూ.రూ.8 లక్షలతో కొనుగోలు చేసిన రెండు బోట్లను మత్స్యశాఖ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ, సుడా, మార్కెట్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత, ఆర్డీఓ జి.గణేష్, తహసీల్దార్ సీహెచ్.స్వామి, కార్పొరేటర్లు తోట గోవిందమ్మ, మాటేటి లక్ష్మి, మేడారపు వెంకటేశ్వర్లు, నాయకులు గుండాల కృష్ణ, తోట రామారావు, పగడాల నాగరాజు, రుద్రగాని ఉపేందర్, కన్నం ప్రసన్నకృష్ణ, మామిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. నూతనంగా మంజూరైన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్, విజిలెన్స్, కంట్రోల్ డివిజన్ కార్యాలయాన్ని మంత్రి జెడ్పీ ప్రాంగణంలో సోమవారం ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా జిల్లాకు కార్యాలయం మంజూరైందన్నారు. ఈమేరకు ఇన్‌చార్జ్ ఈఈ శ్రీనివాస్‌ను మంత్రి అజయ్, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ రాంచంద్రమౌళి, ఈఈ కేవీకే.శ్రీనివాస్‌రావు, డీఈ కోటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పెండింగ్ ఉండొద్దు



గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ గౌతమ్ ఆదేశం

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఆదేశించారు. ఏ ఫిర్యాదును కూడా పెండింగ్‌లో ఉంచొద్దని తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ డేలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించి పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు. ఎక్కువగా రెవెన్యూ సంబంధిత అంశాలతో పాటు పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్‌డీఓ విద్యాచందన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు, జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి

నూతన ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పుల కోసం అందిన దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడమే కాక మార్పులు, చేర్పులపై అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. జిల్లా నుంచి కలెక్టర్ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుకు కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నామని, ఓటరు గుర్తింపు కార్డుల జారీ చేస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, తహసీల్దార్లు స్వామి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

ఏ దారిలో వెళ్దాం ?!

- బదిలీలు, పదోన్నతుల వేళ కొందరు టీచర్ల ఆలోచన
- తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించేందుకు యత్నాలు
- అభ్యంతరాల స్వీకరణకు నేటి వరకు గడువు
- ఈసారి మెడికల్ సర్టిఫికెట్లపై అధికారుల ప్రత్యేక దృష్టి



ఉపాధ్యాయులు సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డీఈఓ కార్యాలయ ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఈక్రమాన కొందరు ఉపాధ్యాయులు అడ్డదారులు వెతుక్కుంటున్నట్లుగా విమర్శలు వినవస్తున్నాయి. గౌరవమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న కొద్దిమంది బదిలీలు, పదోన్నతుల కోసం అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రానికి సమీపాన పోస్టింగ్ దక్కించుకునేలా ఏం చేస్తే బాగుంటుందనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని 21 మండలాల పరిధిలో మొత్తం 3,852మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా... కొందరు అనారోగ్య కారణాలకు సంబంధించి తప్పుడు పత్రాలు సమర్పించే యత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈనెల 15న హెచ్‌ఎంల బదిలీలు జరగనుండగా, ప్రక్రియ ఆర్‌జేడీ పరిధిలో కొనసాగుతుంది. కాగా, సోమవారం సాయంత్రం వరకు బదిలీలపై 120 అభ్యంతరాలు అందగా... పదోన్నతుల సీనియారిటీకి సంబంధించి 1040 అభ్యంతరాలు అందాయని అధికారులు వెల్లడించారు.

మళ్లీ వినియోగించుకునేలా..

బదిలీలు, పదోన్నతుల్లో అధిక పాయింట్ల కోసం పలువురు ఉపాధ్యాయులు రకరకాల మార్గాలు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో అధికంగా స్పౌజ్ కేసులకు సంబంధించి గతంలో 317జీఓ ద్వారా బదిలీ అయిన వారే ఉన్నట్లు సమాచారం. ఓసారి స్పౌజ్ పాయింట్లు వినియోగించుకున్నాక ఎస్‌జీటీలు ఎనిమిదేళ్లు, హెచ్‌ఎంలు ఐదేళ్ల వరకు వినియోగించుకునే అవకాశం ఉండదు. కానీ కొందరు ఈ విషయాన్ని కప్పిపుచ్చి దరఖాస్తు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. భార్యాభర్తలు ఉద్యోగులైన క్రమంలో ఓసారి భార్య, మరోసారి భర్త పేరిట దరఖాస్తు చేసుకున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ప్రత్యేక బోర్డ్ ఏర్పాటు

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల క్రమంలో అనారోగ్యం, ఇతర కారణాలతో సమర్పించే సర్టిఫికెట్ల పరిశీలనకు కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు మెడికల్ బోర్డ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ బోర్డ్‌ను సైతం బోల్తా కొట్టించేందుకు ఉపాధ్యాయులు ఎత్తులు వేస్తున్నట్లు సమాచారం. గతంలో తప్పుడు ధృవపత్రాలు సమర్పించినట్లు తేలగా 21మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో వారిలో కొందరు ఈసారి దరఖాస్తు చేసుకోకపోగా, మరికొందరు మాత్రం అదే బాట ఎంచుకుంటున్నట్లు సమాచారం. అయితే, ఈసారి ఆస్పత్రులు, వైద్యుల నుంచి తీసుకొచ్చిన సర్టిఫికెట్లు కాకుండా.. సదరం క్యాంపులో జారీ చేసిన సర్టిఫికెట్లనే అనుమతించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. పలు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు మాత్రం మెడికల్ సర్టిఫికెట్లను పరిశీలించడమే కాక వ్యక్తిగతంగా కూడా పరీక్షలు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

కఠిన చర్యలకు వెనుకాడేది లేదు...



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి తప్పుడు ధృవపత్రాలు సమర్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అవసరమైతే సస్పెన్షన్‌కైనా వెనుకాడేది లేదు. పారదర్శకంగా ప్రక్రియ చేపట్టేలా సీనియారిటీ జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నాం.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

లాక్కున్న భూములన్నీ తీసుకుంటాం...

- అధికారంలోకి రాగానే మళ్లీ రైతులకే పంపిణీ
- సీఎల్పీ నేత భట్టి, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్క

ముదిగొండ: కాంగ్రెస్ హయాంలో పేదలు, రైతులకు పంపిణీ చేసిన భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కుంటోందని... తాము అధికారంలోకి రాగానే ఆ భూములను తీసుకుని మళ్లీ పంపిణీ చేస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ముదిగొండ మండలం వెంకటాపురానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భట్టి పాల్గొనగా.. తొలుత ముదిగొండ నుంచి వెంకటాపురం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పాక భట్టి మాట్లాడారు. నిరుపేదల నుంచి భూములు లాక్కున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు. కాగా, జిల్లాలో జరుగుతున్న పరిణామాలు అందరికీ తెలిసినవేనని చెప్పారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో ఒక్కసారి కూడా బీఆర్‌ఎస్ గెలవలేదని, కాంగ్రెస్ నుంచి గెలిచిన వారినే లాక్కున్నారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు రుణమాఫీ ఒకేసారి చేస్తే, కేసీఆర్ హామీ ఇచ్చినా విస్మరించారని మండిపడ్డారు. అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఇచ్చిన ఏ హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని ఆరోపించారు. రెండు పడకల ఇళ్లు, దళితులకు మూడెకరాలు భూమి, రైతుల రుణమాఫీ ఇలా ఏ హామీ అమలుచేయలేదని తెలిపారు. ఏదిఏమైనా మరో మూడు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని.. ఆ వెంటనే ప్రజల కష్టాలు తీరుతాయని వెల్లడించారు. తొలుత మండలంలోని గోకినేపల్లిలో మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు అధ్యక్షతన కార్యకర్తల సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొని పలు అంశాలపై సమీక్షించారు. ఈసమావేశాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు రాయల నాగేశ్వరరావు, మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, బాబు, కందిమళ్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ట్రాఫిక్ శిక్షణ కేంద్రం



ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కకల్పించేందుకు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శిక్షణ కేంద్రం త్వరలో అందుబాటులోకి రానున్నది. ఈమేరకు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నమూనా సిగ్నల్స్, సైన్ బోర్డులను ఏర్పాటుచేయడమే కాక ద్విచక్రవాహనం ఎలా నడపాలో వివరించేందుకు సిమిలేటర్ కూడా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఇంకా మద్యం తాగి వాహనాలు నడిపితే ఎదురయ్యే అనర్థాలను వివరిస్తామని, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సెంటర్ కూడా ఉంటుందని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ సెంటర్ ఏర్పాటుచేస్తున్నామని సీపీ వివరించారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి, సీఐ అశోక్, ఏఎస్సై నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు

ప్రతీ సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ డేకు ఈ వారం ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదుదారులు వచ్చారు. కుటుంబ, ఆస్తి తగాదాలతో ఇతర సమస్యలను వివరించగా, విచారణ చేపట్టి చట్టపరిధిలో పరిష్కరించాలని అధికారులను సీపీ వారియర్ ఆదేశించారు.

క్లుప్తంగా

కారేపల్లి విద్యార్థినులకు 17 పతకాలు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కారేపల్లి: ఖమ్మంలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కారేపల్లి మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఈ పోటీల్లో తమ విద్యార్థినులు వివిధ విభాగాల్లో 17 పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎం.డీ.అక్తర్ తెలిపారు. విద్యార్థినులు సాత్విక, నిక్షిత, ప్రత్యూష, కావ్య, దివ్య, అనిత, మానస, అక్షయ, ప్రసన్న, వర్షిత, పల్లవి, మాధురిని సోమవారం ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రెజొనెన్స్ శ్రీనివాసనగర్ విద్యార్థికి గవర్నర్ ప్రశంస


యశ్వంత్‌ను అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో రెజొనెన్స్ శ్రీనివాసనగర్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థి యశ్వంత్ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఆర్.వీ.నాగేంద్రకుమార్, నీలిమ సోమవారం ఆయనను అభినందించి మాట్లాడారు. 'నూతన విద్యావిధానం పాత్ర' అంశంపై రాజ్‌భవన్‌లో నిర్వహించిన పోటీల్లో యశ్వంత్ ప్రతిభ కనబర్చగా, గవర్నర్ తమిళిసై బహుమతి అందజేసి అభినందించారని తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు రవి, లక్ష్మితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐపై విచారణకు మహిళా కమిషన్ ఆదేశం

ఖమ్మంక్రైం: ఖమ్మం వన్‌టౌన్ సీఐ స్వామిపై విచారణకు రాష్ట్ర మహిళా కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. గత నెల 29వ తేదీన ఖమ్మం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న 54వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజులతో పాటు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేసే క్రమంలో దురుసుగా ప్రవర్తించినట్లు కార్పొరేటర్ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో ఘటనపై విచారణ చేసి నివేదిక సమర్పించాలని పోలీసు ఉన్నతాధికారులను మహిళా కమిషన్ బాధ్యులు సోమవారం ఆదేశించారు.

కెనాల్ గండి పూడ్చివేత


కాల్వ గండిని పూడుస్తున్న సిబ్బంది

కల్లూరు రూరల్: కల్లూరు డివిజన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు అనుసంధానంగా ఉన్న మునుకుళ్ల మేజర్ కాల్వకు పడిన గండిని సోమవారం ఎన్నెస్పీ అధికారులు పూడ్చివేశారు. కెనాల్‌కు రోజూ సుమారు 600 నుండి 750 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. అయితే, ఆదివారం సాయంత్రం పలువురు గండి పెట్టడంతో నీరు వృథా కావడమే కాక పలువురి రైతుల పొలాలను ముంచెత్తింది. దీంతో ఎన్నెస్పీ డీఈఈ వెంకటేశ్వరావు ఆధ్వర్యాన సిబ్బంది చేరుకుని గండిని పూడ్చివేశారు. కాగా, కాల్వ సమీపంలోని కోమటికుంటకు నీరు తరలించాలనే ఉద్దేశంతో గండి పెట్టిన రఘునాథగూడెంకు చెందిన నలుగురిపై కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఈఈ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

మధిర: మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి శివార్లలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మధిర టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని తొమ్మిది కోడిపుంజులు, రూ.3,200 నగదుతో పాటు 24 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ ఎస్సై రాజేష్ వెల్లడించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,650	6,200
కందులు	11,300	11,300
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	24,300	18,500
మిర్చి తాలు	8,000	6,000
పత్తి	7,351	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,026

సమ్మె సైరన్

మోగిన అంగన్‌వాడీల

- ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట ధర్నా
- పాల్గొన్న 713 మంది టీచర్లు, 570 మంది హెల్పర్లు
- ప్రత్యామ్నాయ చర్యలపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ దృష్టి


తిరుమలాయపాలెం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్యకర్తలు

ఖమ్మంగాంధీచౌక్: సమస్యల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె బాటపట్టారు. ఈమేరకు సోమవారం సమ్మెకు దిగగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏళ్లుగా నిర్ణయించాలని, పెన్షన్, ఈఎస్‌ఐ వర్తింపచేయడంతో పాటు ఉద్యోగ విరమణ తర్వాత టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లుకు రూ.5 లక్షలు ఇవ్వడమే కాక ప్రమాద బీమా, ఉద్యోగోన్నతులు, మెనూ చార్జీల పెంపు తదితర డిమాండ్లతో సమ్మెలోకి దిగారు. సీఐటీయూ, ఏఐటీయూసీ సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇటీవల ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాల్లో చేర్చనున్నట్లు ప్రకటించింది. దీంతో టీచర్లకు వేతనం పెరగడమే కాక హెల్పర్‌ను నియమిస్తారు. ఇంకా ఉద్యోగ విరమణ వయస్సు పెంపు, విరమణ తర్వాత నగదు చెల్లింపుపై ప్రకటన చేయగా... ఇందులో పలు అంశాలపై అసంతృప్తిగా ఉన్న టీచర్లు సమ్మెకు దిగారు.

కొన్నిచోట్ల పాక్షికం.. ఇంకొన్ని చోట్ల ఎక్కువగా..

జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె ప్రభావం కనిపించింది. ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టులకు గాను 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిల్లో పనిచేసే 713 మంది టీచర్లు, 570 మంది హెల్పర్లు సమ్మెలో పాల్గొన్నట్లు జిల్లా మహిళాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ గుర్తించింది. అయితే, కొన్ని కేంద్రాల్లో సమ్మె ప్రభావం కనిపించినా, ఇంకొన్ని చోట్ల నామమాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. కామేపల్లి ప్రాజెక్టు పరిధిలో 227 మంది, తిరుమలాయపాలెం ప్రాజెక్టులో 132, కల్లూరు ప్రాజెక్టులో 130, సత్తుపల్లి ప్రాజెక్టులో 118, మధిర ప్రాజెక్టులో 93, ఖమ్మం రూరల్ ప్రాజెక్టులో 9, ఖమ్మం అర్బన్ ప్రాజెక్టులో నలుగురు టీచర్లు సమ్మెలో పాల్గొన్నట్లు గుర్తించారు. ఇందులోనే మొత్తంలో మినీ అంగన్‌వాడీ టీచర్లు 67 మంది ఉండగా, మెయిన్ కేంద్రాల్లోని హెల్పర్లు 570 మంది కూడా సమ్మెలో భాగస్వాములయ్యారు.

తెరుచుకోని కేంద్రాలు

టీచర్లు, హెల్పర్లు సమ్మెకు దిగడంతో జిల్లాలోని పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోలేదు. దీంతో 713 కేంద్రాల లబ్ధిదారులకు పోషకాహారం అందలేదు. పలువురు కేంద్రాలకు వచ్చినా తాళాలు ఉండడంతో వెనుతిరిగారు. సమ్మెలో పాల్గొన్న టీచర్లు, హెల్పర్ల వివరాలతో పాటు తాళాలు తీయని కేంద్రాలను వివరాలతో ఉద్యోగులు నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె బాట పట్టడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించారు. టీచర్ల నుంచి తాళాలు తెప్పించి సమ్మెలో పాల్గొనని సమీప కేంద్రాల వారితో నిర్వహణ కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఏదిఏమైనా మంగళవారం అన్ని కేంద్రాలను తెరవాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది.


ఖమ్మం సారథినగర్‌లో మూతపడిన కేంద్రం

సమ్మెకు బీఆర్‌టీయూ దూరం

అంగన్‌వాడీల కార్యకర్తల సమ్మెకు తమ సంఘం పాల్గొనడం లేదని బీఆర్‌టీయూ ఖమ్మం యూనిట్ బాధ్యులు తెలిపారు. ఈ విషయమై జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమాధికారి తాళ్లూరి సుమ, ఖమ్మం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కవితకు లేఖలు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలపై మంత్రి సత్యవతి రాథోడ్ ఇటీవల చర్చించి పరిష్కారానికి కృషి చేస్తుండడంతో సమ్మెలో పాల్గొనడం లేదని తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు మాటూరు లక్ష్మీనారాయణతో పాటు లక్ష్మి, హస్నా, అంజలి, రాణి, కళావతి, విజయలక్ష్మి, పద్మ, రత్నకుమారి, సునీత, అలివేలు, ఉపేంద్ర, సుమ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మరో చాన్స్ కోరడం విడ్డూరం

- కాంగ్రెస్‌పై ఎంపీ వద్దిరాజు ఆగ్రహం
- ఇల్లెందులో రవిచంద్రకు ఘన స్వాగతం
- ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యాన సభ


ఇల్లెందులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీలు వద్దిరాజు, కవిత, ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: దేశాన్ని 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఒక్క చాన్స్ ఇవ్వాలని కోరడం విడ్డూరంగా ఉందని రాజ్యసభ సభ్యులు, బీఆర్‌ఎస్ ఇల్లెందు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యాక సోమవారం తొలిసారి ఇల్లెందుకు వచ్చిన రవిచంద్ర బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో, అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీ ఆర్ ఆశీస్సులతో ఎమ్మెల్యే హరిప్రియ మరోమారు ఎన్నికల బరిలో నిలుస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో ఈ నియోజకవర్గంలో 1.28 లక్షల మంది లబ్ధి పొందారని, ఇందులో 1.07 లక్షల మంది మహిళలే ఉన్నారని తెలిపారు. వీరంతా బీఆర్‌ఎస్‌కే ఓటేస్తారని, దీంతో హరిప్రియ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన కోరం కనకయ్యను తిరిగి జెడ్పీ చైర్మన్‌ను చేస్తే పార్టీకి వెన్నుపోటు పొడిచాడని ఆరోపించారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో పార్టీలోని అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగుతామని తెలిపారు. ఇల్లెందు నుంచి ఇప్పటి వరకు కారు గుర్తుపై ఎవరూ గెలువలేదని, కేసీఆర్ ఆశీస్సులతో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ ఎన్నికల్లో గెలుపు ద్వారా చరిత్రను తిరుగరాస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు.

గంగిరెద్దులోళ్లలా వస్తుంటారు..

సంక్రాంతికి వచ్చే గంగిరెద్దులోళ్లలా కొందరు ఎన్నికలప్పుడే వస్తుంటారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎంపీ కవిత అన్నారు. సీఎం కేసీఆర్ దీవెనతో హరిప్రియ మరోసారి ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారని, అందరికీ అందుబాటులో ఉండే హరిప్రియను గెలిపించాలని కోరారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ గెలిచి తీరుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఈ జిల్లాకు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, జెడ్పీటీసీ ఉమ, పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మనోహర్ తివారీ, సుధీర్‌తోత్లా, పరుచూరి వెంకటేశ్వరరావు, జేకే శ్రీనివాస్, సిలివేరు సత్యనారాయణ, జనగం కోటేశ్వరరావు, తాతా గణేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రవిచంద్రకు కార్యకర్తలు భారీగా స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అంతకుముందు మహబూబాబాద్ క్రాస్ రోడ్‌లోని సువర్చలా సహిత ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో కొమ్ము, డోలు, గిరిజన నృత్యాలు అలరించాయి.

ఫలప్రదం కాని చర్చలు

ఇల్లెందు బీఆర్‌ఎస్‌లో నెలకొన్న అసంతృప్తిపై జరిగిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఆదివారం అర్ధరాత్రి ఖమ్మంలో ఓ రహస్య ప్రదేశంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలలో చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్ నాయక్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పులిగళ్ల మాధవరావుతో పాటు బయ్యారం, కామేపల్లి మండలాల నేతలు పాల్గొన్నారు. కాగా డీవీ, తాతా మధు, హరిప్రియ, హరిసింగ్ మధ్య పరస్పరం వాగ్వాదం జరిగింది. అసమ్మతి పేరుతో తనకు టికెట్ రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారంటూ తాతా మధు, డీవీపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, సోమవారం నాటి ర్యాలీకి డీవీ, మాధవరావు దూరంగా ఉండడంతో సమస్య సమసిపోలేదని తెలుస్తోంది.

వరి విత్తనం ముంచేసింది..

దిగుబడి తగ్గే అవకాశముందని రైతుల ఆవేదన


వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

సత్తుపల్లి: వరి పొలం సగం పొట్ట దశకు రాగా, మరో సగం ఈనడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. సత్తుపల్లి శివార్లలో రైతులు గొర్లమారి సుధాకర్‌రెడ్డి, మందపాటి సోమిరెడ్డి, యరమల శ్రీనివాసరెడ్డి తదితరులు 65 ఎకరాల్లో వరి సాగు చేశారు. కరీంనగర్‌కు చెందిన వరుణ్ సీడ్స్ విత్తనాలను సత్తుపల్లిలోని తెలంగాణ అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో కొనుగోలు చేసి పంట నాటారు. అయితే, 68 రోజులకు పొట్టదశకు రావాల్సి ఉండగా, 65 రోజులకే పంట సగం ఈనటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఎకరం పొలంలో 42 బస్తాలు దిగుబడి వస్తుందని, సగం పంట ముందే రావటంతో దిగుబడి తగ్గే ప్రమాదముందని వాపోతున్నారు. ఈ విషయమై అగ్రోస్ రైతు సేవా కేంద్రం యజమానికి ఫిర్యాదు చేశామని, ఆయన కంపెనీ దృష్టికి తీసుకెళ్లినా పంటను పరిశీలించడానికి ఎవరూ రాలేదని తెలిపారు. ఈమేరకు బాధిత రైతులు సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను కలిసి ఫిర్యాదు చేయడంతో ఆయన వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందనరావుతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయమై ఏఓ శ్రీనివాసరావును వివరణ కోరగా, ఇప్పటికే రైతుల పొలాలను పరిశీలించామని తెలిపారు. శాస్త్రవేత్తలు వచ్చి పరిశీలిస్తే తప్ప ఎంత మేరకు నష్టం వస్తుందో తెలియదని వెల్లడించారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు


గిరిప్రసాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం పాత బస్టాండ్ వద్ద గిరిప్రసాద్ విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోటు ప్రసాద్ మాట్లాడుతూ సాయుధ పోరాట సమయాన కమ్యూనిస్టులు లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయగా, ఇప్పుడు పాలకుల తీరుతో కొందరి చేతుల్లోకే భూమి వస్తోందని తెలిపారు. ఈమేరకు పాలకుల విధానాలపై పోరాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జానీమియా, సింగు నర్సింహారావు, మహ్మద్ సలాం, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్ పాల్గొన్నారు.

'విజయభేరి'ని జయప్రదం చేయండి

డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్ తుక్కుగూడలో ఈనెల 17న కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరగనున్న విజయభేరి సభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ హాజరవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలుచేయనున్న పథకాలపై ప్రకటన చేయనున్న నేపథ్యాన సభకు పార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యేలా ప్రచారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావేద్, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, వడ్డే నారాయణరావు, రాందాస్‌నాయక్, నాయకులు కొత్తా సీతారాములు, వేగినాటి ఉదయ్‌కుమార్, బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశం

ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈసమావేశానికి పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ మహ్మద్ ఆరిఫ్ నసీం ఖాన్ హాజరవుతారు. అలాగే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పోదెం వీరయ్య పాల్గొని మాట్లాడారు. ఈమేరకు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల బాధ్యులు హాజరుకావాలని నాయకులు కోరారు.

భద్రకాళి పూజారుల సంఘం కమిటీ ఎన్నిక


భద్రకాళి పూజారుల సంఘం నూతన కమిటీ

పాల్వంచ: జగదాంబ మేడారం భద్రకాళి పూజారుల సంఘం నూతన కమిటీని సోమవారం స్థానిక కరకవాగు శ్రీజగదాంబదేవీ ఆలయంలో ఎన్నుకున్నారు. జాతీయ గౌరవ అధ్యక్షుడిగా కుడికాలు ఆంజనేయులు, జాతీయ అధ్యక్షుడిగా తేజావత్ రాములునాయక్, ప్రధాన కార్యదర్శిగా నూనావత్ శంకర్ సాధు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎలుపుల ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుగులోతు కిశోర్, ఉపాధ్యక్షుడిగా కారం మోహన్, ప్రచార కార్యదర్శిగా శీలం హరిత, కోశాధికారిగా ఓదెలు, కార్యవర్గ సభ్యులుగా సీతారాంసాధు, సోంది చిరంజీవి, స్వరూప, యాకమ్మ, రాజీ తదితరులను ఎన్నుకున్నారు.

విషజ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్


దర్బార్‌లో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఆదివాసీ గిరిజన గ్రామాల్లో డెంగీ, ఇతర విషజ్వరాలు ప్రబలుతున్నాయని, నివారణకు వైద్యశాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ గ్రామాల గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. అర్హతల మేరకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల పట్ల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్‌ఓ సురేష్ బాబు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ శ్రీనివాస్, ఏపీఓ పవర్ మునీర్ పాషా, ఏడీ భాస్కరన్, ఉద్యాన వనాధికారి అశోక్ కుమార్, డీఎస్‌ఓ ప్రభాకర్ రావు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వెంకటేశ్వరరావు (ఫైల్)

వేంసూరు: మండలంలోని భీమవరంలో విద్యుదాఘాతం కారణంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం. భీమవరానికి చెందిన ఐనంపూడి వెంకటేశ్వరరావు (32) కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన సోమవారం ఉదయం దుస్తులను ఇంటి వద్ద తీగపై ఆరవేస్తుండగా ఆ తీగకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్‌కు గురయ్యాడు. ఈ క్రమంలో కుమారుడిని కాపాడేందుకు ఆయన తల్లి సరోజ యత్నించగా ఆమె కూడా షాక్ బారిన పడింది. దీంతో వెంకటేశ్వరరావు కేకలు వేస్తుండగా కుటుంబీకులు వచ్చి కర్రలతో వైరు నుంచి తప్పించి సత్తుపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై ఎస్‌ఐ వీరప్రసాద్ కేసు నమోదు చేయగా, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ తదితరులు వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

పాముకాటుతో రైతు..

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లకు చెందిన రైతు వంకాయ నారాయణ(74) పాముకాటుతో మృతి చెందాడు. వ్యవసాయ పొలానికి ఆదివారం వెళ్లిన ఆయనను పాము కాటు వేసింది. దీంతో సమీప రైతులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా రాత్రి మృతి చెందాడు. ఈమేరకు నారాయణ కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

తిరుమలాయపాలెం: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మతి చెందాడు. మండలంలోని బచ్చోడుకు చెందిన చింతల వీరయ్య(52) కొన్నేళ్లుగా మద్యానికి బానిస కాగా, ఈనెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయాన పురుగుల మందు తాగాడు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఆయనను ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో మధ్యాహ్న భోజన కార్మికురాలు..

కొణిజర్ల: విధి నిర్వహణలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికురాలు గుండెపోటుతో మృతి చెందింది. మండలంలోని సింగరాయపాలెంకు చెందిన షేక్ సలీమా (53) కొణిజర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తోంది. పాఠశాలకు సోమవారం వచ్చిన ఆమె పని చేస్తుండగానే కుప్పకూలడంతో ఉపాధ్యాయులు ఖమ్మం తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. సలీమాకు భర్త, ఇద్దరు కుమార్తె, ఓ కుమారుడు ఉండగా, ఎంఈఓ మోదుగు శ్యాంసన్ ఆమె కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. సర్పంచ్ దొడ్డపనేని జ్యోతి, తదితరులు సలీమా మృతదేహం వద్ద నివాళులర్పించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. అంగన్‌వాడీ టీచర్ ఎస్.కళావతి సోమవారం ఉదయం కేంద్రానికి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండడంతో లోపల పరిశీలించింది. కేంద్రంలోని ఎల్‌ఈడీ టీవీ, రెండు గ్యాస్ సిలిండర్లు, మూడున్నర కేజీల వంట నూనె చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పంప్ ఆపరేటర్‌పై దాడి

రఘునాథపాలెం: మండలంలోని రాములు తండా పంప్ ఆపరేటర్ బానోత్ మంగీలాల్‌పై సోమవారం దాడి జరిగింది. గ్రామంలో పైపులైన్ లీకేజీని ఆయన పరిశీలిస్తుండగా, గ్రామానికే చెందిన బి.బాల్‌సింగ్, ఆయన భార్య, తల్లి దూషిస్తూ దాడి చేశారు. విషయం తెలుసుకున్న మంగీలాల్ భార్య రాగా ఆమెపై కూడా దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, పంప్ ఆపరేటర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల మల్లయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంపీఓ, ఎంపీడీఓకు ఫిర్యాదు చేయడమే కాక రఘునాథపాలెం ఎస్సై దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.